ప్రజాశక్తి
సోమవారం 30 డిసెంబర్ 2024
5
కర్నూలు





రాజేశ్వర్ రెడ్డి, సోమన్నల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్ రెడ్డి తదితరులు

ఎరుపెక్కిన ఎమ్మిగనూరు

సిపిఎం జిల్లా 23వ మహాసభ ప్రారంభం

- భారీ ప్రదర్శన.. కదం తొక్కిన ఎర్రదండు..

- ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఉండి రాయలసీమకు ఏం చేశారు..? : ఎంఏ.గఫూర్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకర్ రెడ్డి, గౌస్‌దేశాయ్ తదితరులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/గోనేగండ్ల


ఎమ్మిగనూరు పట్టణం అరుణ పతాకాలతో ఎరుపెక్కింది. సిపిఎం కర్నూలు జిల్లా 23వ మహాసభ ఎమ్మిగనూరులో ఆదివారం ప్రారంభమైంది. పట్టణంలో ఎర్రదండు కదం తొక్కింది. తొలుత కొత్త మున్సిపల్ కార్యాలయం ఆవరణ నుండి పోస్ట్ ఆఫీస్, కూరగాయల మార్కెట్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, సోమేశ్వర్ టాకీస్ సర్కిల్, శ్రీ నీలకంఠేశ్వర దేవాలయం, బంగారు దుకాణాల సముదాయం, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా కార్యకర్తలు కోలాటం వేస్తూ ర్యాలీ ముందు భాగాన నడిచారు. అలాగే డప్పు కళాకారులు డప్పు నృత్యం వేస్తూ సాగారు. అనంతరం సీతారాం ఏచూరి వేదిక మీద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజినేయులు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు.



ఎమ్మిగనూరు పట్టణంలో ప్రజా ప్రదర్శనలో అగ్రభాగాన సిపిఎం నేతలు

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఉండి రాయలసీమకు ఏం చేశారు..? : ఎంఏ.గఫూర్

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఉండి రాయలసీమకు ఏం చేశారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఏ.గఫూర్ మాట్లాడుతూ మతం పేరుతో ప్రజల మధ్య మోడీ చిచ్చు పెడుతున్నారని, అలాంటి మోడీకి రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు పెంచిన భారం జగన్ పాపమేనని, రూ. 12 లక్షల కోట్లు అప్పు చేస్తే రూ. 2 లక్షల 80 వేల కోట్లు బటన్ నొక్కడం ద్వారా ప్రజలకు పంచితే మిగితావి ఎవరి జేబులోకి వెళ్ళాయని ప్రశ్నించారు. మోడీ విమానాలను, రైల్వేలను అమ్మితే, చంద్రబాబు రోడ్లను అమ్మి టోల్ గేట్ పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. రూ. 69 వేల కోట్లతో అమరావతి కట్టే చంద్రబాబుకు కర్నూలులోని సాగునీటి ప్రాజెక్టులు పట్టడం లేదన్నారు. గుండ్రేవుల, వేదవతి పూర్తి చేస్తానని హామీ ఇచ్చి తట్టెడు మట్టి వేయలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

భవిష్యత్ ఎర్ర జెండాదే

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు



రైతులు, కష్టజీవుల కోసం పోరాడేది సిపిఎం అని, భవిష్యత్ ఎర్ర జెండాదేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. అదాని, అంబానీలు కరెంటు, గ్యాస్ చాలదని ఇప్పుడు గ్రామీణ ప్రాంతంలోని సంతలపై పడ్డారని, భవిష్యత్‌లో అదానీకి ఈ సంతలను కుడా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు 7 నెలలు కావొస్తున్నా అమలు చేయడం లేదన్నారు. రాయలసీమ నుంచి ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు గెలిచినా ఇక్కడి వలసలు పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో బిజెపికి తోడు పవన్ కళ్యాణ్ మతోన్మాదాన్ని రెచ్చడుతున్నారని విమర్శించారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం పోరాడిన ఘనత సిపిఎందని అన్నారు.

అందరూ ఏకమై పోరాడాలి


- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి



రాష్ట్రంలో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, మాజీ సిఎం జగన్ నియోజక వర్గంలో రైతు కుటుంబంతో ఆత్మహత్య చేసుకోవడం ఈ పాలకుల చేతగాని తనమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో రైతుల సమస్యపై పోరాడుతుంటే మోడీ ప్రభుత్వం లాఠీతో కొడుతూ తప్పుడు కేసులతో జైల్లో వేస్తున్నారని విమర్శించారు. 2023 కరువు మండలాల రైతులకు నష్ట పరిహారం చెల్లించడం లేదని, రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటూ చంద్రబాబు రైతులకు ఎకరాకు చెల్లించే అన్నదాత సుఖీభవ ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. అందరూ ఏకమై పోరాడాలని, హక్కులను సాధించుకోవాలని కోరారు.

నష్టపరిహారం కోసం పోరాడిన ఘనత సిపిఎందే

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్



జిల్లాలో రైతుల నుండి ప్రాజెక్టుల పేర్లతో తీసుకున్న భూములకు నష్టపరిహారం వచ్చేంత వరకు పోరాడిన ఘనత సిపిఎందేనని పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అన్నారు. దేవనకొండ మండలంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ప్రకటించే దాకా ఉద్యమించామని తెలిపారు. అంగన్వాడీ ఆందోళనలకు మద్దతుగా నిలబడింది సిపిఎం అన్నారు. రాయలసీమ బిడ్డనని ఎమ్మెల్యేగా గెలిచిన టిడిపి, వైసిపి ఎమ్మెల్యేలు ఆలోచించాలని, కర్నూలు జిల్లాలో వలసల నివారణపై, ప్రాజెక్టుల నిర్మాణం కోసం పని చేయాలని డిమాండ్ చేశారు. దళితుల కోసం పోరాడిన ఘనత సిపిఎంకే ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం, యువతకు ఉపాధి కోసం పరిశ్రమల కోసం, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు, పట్టణంలో రెండవ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు కోసం సిపిఎం పోరాడుతుందని తెలిపారు.

బహిరంగ సభ ప్రారంభానికి ముందు ప్రజా నాట్యమండలి కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, రాష్ట్ర నాయకులు రామన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి నారాయణ, వెంకటేశులు, జిల్లా నాయకులు హనుమంతు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతినిధుల సభ ప్రారంభం..

అనంతరం కామ్రేడ్ రాజేశ్వర్ రెడ్డి, కామ్రేడ్ సోమన్న ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. రాజేశ్వర్ రెడ్డి, సోమన్న చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అంజిబాబు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అధ్యక్ష వర్గంగా పి.నిర్మల, టి.రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు.

జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలి - మహాసభ తీర్మానం

కర్నూలు జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానంను జిల్లా కమిటీ సభ్యులు టి.నరసింహా ప్రవేశ పెట్టారు. జిల్లా కమిటీ సభ్యులు ఎండి ఆనంద్ బాబు బలపరిచారు. జిల్లాలో తాగు, సాగునీటి కోసం పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, కర్నూలును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని, జిల్లాలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని, జిల్లాలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.



బహిరంగ సభలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు



సుందరయ్య నృత్య రూపకం ప్రదర్శిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

రెండు వారాల్లోపు లీకేజీ పనులు పూర్తి

- జెసి డాక్టర్ నవ్య

- సుంకేసుల బ్యారేజీ పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



సుంకేసుల బ్యారేజీని పరిశీలిస్తున్న జెసి నవ్య

సుంకేసుల బ్యారేజీ లీకేజీ పనులను రెండు వారాల్లోపు పూర్తి చేయాలని జెసి డాక్టర్ బి.నవ్య ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సుంకేసుల బ్యారేజీని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... సుంకేసుల బ్యారేజీలో చిన్నపాటి లీకేజీలు ఉన్నాయన్నారు. వాటిని అరికట్టి జిల్లాలోని ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలకు సక్రమంగా నీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కెసి కెనాల్ డిఇ ప్రసాదరావు, ఎఇ భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెరవలి విద్యార్థినులు

ప్రజాశక్తి - మద్దికెర



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు పెరవలి విద్యార్థులు ఎంపికైనట్లు సన్‌రైజ్ స్కూల్ కరస్పాండెంట్ రవి శేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణంలో నిర్వహించిన అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో పెరవలి గ్రామానికి చెందిన సన్‌రైజ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అబాకస్ సీనియర్ లెవెల్‌లో 6వ తరగతి ఇ.పల్లవి మొదటి స్థానం, 7వ తరగతి నుంచి హరి ప్రణతి, 5వ తరగతి నుంచి జె.పుష్పాంజలి రెండో స్థానంలో నిలిచారన్నారు. అబాకస్ విజువలైజేషన్‌లో 6వ తరగతి పల్లవి మొదటి స్థానం, 7వ తరగతి నుంచి హసీనా రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. వీరు జనవరి 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పత్తికొండ

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామ సమీపంలోని 343వ సర్వే నెంబర్‌లోని 1.01 ఎకరాల ప్రభుత్వ భూమిలో సిపిఎం నాయకులు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జెండాను పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు. గత 8 ఏళ్లుగా గ్రామంలోని పేదలకు ప్రభుత్వ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అనేక పోరాటాలు చేశామని పేర్కొన్నారు. నేటికీ గ్రామంలో 100 మందికి పైగా పేదలు ఉన్నారని అన్నారు. మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్, గంగన్న, రామాంజినేయులు, నాయకులు అప్పన్న, ఉరుకుందు, నడిపి రంగన్న, గ్రామస్తులు ప్రభాకర్, బ్రహ్మయ్య, రంగయ్య, వన్నూరు, సాంబశివ, రంగన్న, లక్ష్మన్న, ఉల్తెప్ప, పరమేష్ పాల్గొన్నారు.

ఉన్నతస్థానంలో నిలిచేందుకు మార్షల్ ఆర్ట్స్

- ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

విద్యార్థులు ఉన్నతస్థానంలో నిలిచేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీలను ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. చెస్ క్రీడాకారుడు గుకేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇండియా క్రికెట్ ప్లేయర్ నితీష్ కూమార్ రెడ్డిని అభినందించారు. ఇద్దరు క్రీడాకారులు భారతదేశానికి గుర్తింపు తీసుకొచ్చారని, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నందునే వారు క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమని, ప్రాణాయామం, యోగా, ధ్యానం, వ్యాయామం ఉండడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్ కర్నూలులో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. క్రీడా శిక్షకులు రామాంజనేయులు, చిన్న సుంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కష్టపడి ఇష్టంతో చదివితే ఉన్నత స్థాయి

- సిఐడి సిఐ పెద్దయ్య నాయుడు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కష్టపడి ఇష్టంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సిఐడి సిఐ పెద్దయ్య నాయుడు తెలిపారు. ఆదివారం కర్నూలు నగరం బిర్లా కాంపౌండ్‌లోని ఆర్‌ఎస్ అకాడమీలో ఇటీవల విడుదలైన ఎస్‌ఎస్‌సి జీడీ కానిస్టేబుల్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన అశ్విని, భాస్కర్ నాయక్, లాలూ నాయక్, రాజు, శేఖర్, ఇతర విద్యార్థులను ఆర్‌ఎస్ అకాడమీ యాజమాన్యం సన్మానించింది. ముఖ్యఅతిథిగా సిఐ పెద్దయ్య నాయుడు, ఐఎఎస్ స్టూడెంట్స్ మెంటర్ రవీంద్రనాయుడు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువులో రాణించాలని తెలిపారు. గురువులు చూపిన దారిలో ముందుకెళ్లాలని సూచించారు. ఆర్‌ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్, మ్యాథ్స్ ఫాకల్టీ కె.మధు, పిఇటి మాస్టర్ సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిఐ పెద్దయ్య నాయుడు

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల ట్రయల్ రన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్ మైదానంలో సోమవారం నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రారంభమయ్యే పిఎంటి (ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), పిఇటి (ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్) పరీక్షల నేపథ్యంలో పోలీసులు, సిబ్బంది, కొంతమంది యువకులతో ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదివారం ట్రయల్ రన్ (రిహార్సల్) నిర్వహించారు. కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలా విధులు చేపట్టాలో దిశానిర్దేశం చేశారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఎస్పీ ఏర్పాట్లపై ఆరా తీసి, పరిశీలించారు. దేహదారుఢ్య పరీక్షల దగ్గర ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా హైదరాబాద్ నుంచి వచ్చిన టైమింగ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో ఆర్‌ఎఫ్ ఐడి సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీలు జి.హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

- ప్రజాశక్తితో టిడ్కో ఫుల్ అడిషనల్ చార్జి ఎస్ఇ జి.సూర్య నారాయణ ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



'ప్రభుత్వ సహకారంతో పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రధాన లక్ష్యం. టిడ్కో గృహాల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇంకా 20 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు అన్నీ కల్పించేందుకు కృషి చేస్తున్నాం' అని టిడ్కో ఫుల్ అడిషనల్ చార్జి ఎస్ఇ జి.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో టిడ్కో గృహాల పరిస్థితిపై ప్రజాశక్తితో ఎస్ఇ జి.సూర్యనారాయణ ముఖాముఖి మాట్లాడారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని గృహాలు నిర్మించారు..?

ఎస్ఇ : కర్నూలు నగరంలో 10 వేలు, ఆదోనిలో 4,700, ఆళ్లగడ్డలో 1,392, నంద్యాలలో 10 వేలు, ఎమ్మిగనూరులో 4,272 గృహాలను నిర్మించాం.

టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులన్నీ కల్పించారా..?

ఎస్ఇ : టిడ్కో గృహాల వద్ద అంతర్గత రోడ్లు , మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం.

టిడ్కో గహాల్లో లబ్ధిదారులు చేరకపోవడానికి కారణాలు ఏమిటి..? సమస్యలను అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : టిడ్కో గృహాలు నిర్మించిన ప్రదేశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు. మార్కెట్ లేదు. వైద్యశాల లేదు. విద్యావసతి, సంపూర్ణంగా నీటి వసతి లేదు. చుట్టూ రక్షణ గోడలు లేవు. అందుకే లబ్ధిదారులు టిడ్కో గృహాల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వానికి ఉత్తరాలు రాశాం. కనీసం బస్సు సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని నివేదించాం. మహిళా మార్ట్ మార్కెట్, అంగన్వాడీ కేంద్రం, వైద్యశాల, స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి ఆటోలు ఇప్పించేందుకు కృషి చేయాలని ప్రభుత్వానికి ఉత్తరాలు రాసి పంపాము.

టిడ్కో గృహాల వద్ద ఆకతాయిల సంచారం ఎక్కువైనట్లు తెలిసింది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

ఎస్ఇ : టిడ్కో గృహాల వద్ద మనుషులు లేని కారణంగా ఆకతాయిలు వీధి దీపాలను రాళ్లతో కొట్టి పగలగొడుతున్నారు. రక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బందిని ఉంచాం. పగలు ఇద్దరు, రాత్రి ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పోలీసుల ద్వారా గస్తీని కూడా ఏర్పాటు చేయనున్నాం.

టిడ్కో గృహాల వద్దకు ఆర్‌టిసి బస్సులు తిప్పేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : టిడ్కో గృహాల వద్దకు బస్సులు తిప్పాలని ప్రభుత్వాన్ని కోరాం. ప్రజలు అలవాటు పడి బస్సులు ఎక్కే వరకు ఆక్యుఫెన్సీ రాకపోయినా అందుకు సంబంధించిన నష్టాన్ని ప్రభుత్వమే భరించే విధంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

టిడ్కో గృహాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు అన్ని ప్రాంతాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది..? దీనిపై మీ సమాధానం..?

ఎస్ఇ : ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బిల్డింగులు నిర్మించేందుకు రూ. 65.65 కోట్లు, రోడ్లు, స్ట్రీట్ లైట్లు లాంటి వసతుల ఏర్పాటుకు రూ. 33.73 కోట్లు, సీవెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల కోసం రూ. 6.98 కోట్లు మొత్తం రూ.106.36 కోట్లు బిల్లులు పెండింగ్ ఉన్నాయి.

టిడ్కో గృహాల్లో చేయాల్సిన పనులు ఇంకా ఎంత పెండింగ్ ఉన్నాయి...?

ఎస్ఇ : టిడ్కో గృహాల్లో ఇంకా 20 శాతం పనులు చేయాల్సి ఉంది. వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

టిడ్కో గృహాలు లబ్ధిదారులందరికీ కేటాయించి నివాసం ఉండేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : కర్నూలు, నంద్యాల జిల్లాల మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వంతో నిధులు మంజూరు చేయించాలి. నగరపాలక సంస్థ, పోలీసు, విద్యుత్తు, ఆర్టీసీ, అన్ని శాఖల అధికారులను కలెక్టర్ సమన్వయం చేసి సమస్యలను అధిగమించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే పేద ప్రజలు టిడ్కో గృహాల్లో చేరేందుకు ముందుకు వస్తారు. పేదల సొంతింటి కల కూడా నేరవేరుతుంది.





ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

ఆదోనిలో సిపిఎం బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి నుంచి బైక్ ర్యాలీని సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఆదోని పట్టణంలో జనాభాకనుగుణంగా అదనపు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని, మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని, పరిశ్రమలు నెలకొల్పాలని మహాసభలో చర్చిస్తామన్నారు. ప్రభుత్వాలు మారినా ఈ ప్రాంత అభివృద్ధికి మాత్రం పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిపారు. ఆదోనిలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. రిలయన్స్ ట్రెండ్స్ నుంచి ఆర్ట్స్ కళాశాల రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా సూచకలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, నాగరాజు, వెంకటేష్, రామాంజనేయులు, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు అజీమ్ ఖాన్, ఇక్బాల్, ఉచ్చీరప్ప, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, ఆటో యూనియన్ నాయకులు హనుమంతు, హమాలీ యూనియన్ నాయకులు వెంకటేష్ ఉన్నారు.

'ప్రభాకర్'తో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - దేవనకొండ



మిరప పంట రైతులతో పిహెచ్ఎస్ ప్రతినిధులు

ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్స్‌తో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని పిహెచ్ఎస్ కంపెనీ ప్రతినిధులు కిరీటి, మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం దేవనకొండ గ్రామ శివారులో దర్గయ్య అనే రైతు మిరప పంటలో పిహెచ్ఎస్ సీడ్స్ డిస్ట్రిబ్యూటర్స్ వెంకట సాయి ట్రేడర్స్ వేణు, శివ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన చేపట్టారు. పిహెచ్ఎస్ కంపెనీకి చెందిన విక్రాంత్, ముకుంద మిరప సీడ్స్ రకాలకు చెందిన మిరప పంట అధిక దిగుబడుల క్షేత్ర ప్రదర్శనకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. విరగ కాసిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు రైతులతో మాట్లాడారు. నూతన వంగడాలైన విక్రాంత్, ముకుంద రకాలకు చెందిన మిరప సాగు చేసిన రైతులు ఎకరాకు 40 నుంచి 65 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారని తెలిపారు. రైతు దర్గయ్య మొదటి కోతలోనే 48 క్వింటాళ్ల దిగుబడి సాధించారని చెప్పారు. పిహెచ్ఎస్ సిబ్బంది మహేష్, శివ, హరి, వీరేష్, రైతులు పాల్గొన్నారు.

మంచి పనులతోనే గుర్తింపు : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచి గోవిందరాజులు

ప్రజలకు మంచి పనులు చేస్తేనే సమాజంలో ఒక గుర్తింపు ఉంటుందని సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. ఆదివారం చిప్పగిరిలోని సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్ జయమ్మ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచి గోవిందరాజులు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చిన్నతనం నుంచి మంచి అలవాట్లతో మంచి పనులు చేసి గౌరవం పెంపొందించుకోవాలని కోరారు. గ్రామంలో అందరూ ఐకమత్యంతో అభివృద్ధికి తోడ్పాటునందించుకోవాలన్నారు. సీయోను ప్రార్థన మందిరంలో దైవ సేవకులు టి.జయమ్మ, రాజు సేవలు హర్షించదగ్గ విషయమన్నారు.

ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎంఆర్‌పిఎస్ ఓర్వకల్లు మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా బొగ్గుల సురేంద్రబాబు, ఉపాధ్యక్షులుగా బండుమూడి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొల్లె పోగు లక్ష్మణ్, అధికార ప్రతినిధిగా సన్యాసి సురేష్, కార్యదర్శులుగా బి.రామకృష్ణ, చాట్ల నారాయణ, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి సూరి మాదిగ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

శనగకు తెగుళ్ల బెడద...

- అనుకూలించని వాతావరణం
- మందులు పిచికారితో పెట్టుబడులు భారం
- వరుస తెగుళ్లతో రైతు కుదేలు

ప్రజాశక్తి - చిప్పగిరి

పప్పు శనగ పంటను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. ఒకవైపు ప్రతికుల వాతావరణంతో అల్లాడుతుండగా.. వేరుకుళ్ళు, ప్రస్తుతం పైరుకు పసురు తెగులు సోకి నాశనం అవుతోంది. తమ ఆశలన్నీ నీరు గారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు వారానికోసారి తుపాను ప్రభావంతో చిరుజల్లులకు పూత నేలరాలి దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంట పూత, పిందె దశలో ఉంది. పైరంతా పసుపు రంగుగా మారి కాయల్లోని గింజ నాసిరకంగా.. కుళ్లిపోయినట్లు తయారవుతోంది. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. వేర్లన్నీ తెల్ల బారుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో ఎక్కువ శాతం రబీలో ప్రధాన పంట అయిన పప్పు శనగ పంటపైనే ఎక్కువగా రైతులు ఆధారపడి ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.



తెగుళ్లు సోకడంతో దెబ్బతిన్న శనగ పంట



దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు

తెగుళ్లతో పంట ఎండిపోతోంది


- రైతు రాజన్న, బెల్డోన



వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పప్పు శనగకు వరుస తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుతం పైరంతా పసుపు రంగుగా మారి ఎండిపోతోంది. తెగుళ్ల ప్రభావం దిగుబడులపై ప్రభావం చూపుతోంది. ఆశలన్నీ నీరు కారుతున్నాయి. వరుసగా వస్తున్న తుపాను ప్రభావంతో ఏం నష్టం కలిగిస్తోంది.

ఒకే పంట వేయడంతోనే తెగుళ్లు

- ఎఒ జయలక్ష్మి




మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు పొలాల్లో ప్రతేడాది ఒకే పంట సాగు చేస్తుండడంతో, పంట మార్పిడి లేనందు వల్ల తెగుళ్ల ప్రభావం అధికంగా ఉంది. ఒక లీటరు నీటిలో టేబు కొనజోల్ ఒక మిల్లీలీటర్ కలిపి చెట్టు తడిచేలా పిచ్చికారి చేస్తే కొద్ది వరకు అరికట్టవచ్చు.

ముఖ్యమంత్రి బాబుకు రుణపడి ఉన్నాం

- దూదేకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సాయిబాబా

ప్రజాశక్తి - కౌతాళం



టిప్పు సుల్తాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దూదేకుల నాయకులు, సభ్యులు రుణపడి ఉంటారని దూదేకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సాయి బాబా, కార్యదర్శి షేక్షావలీ తెలిపారు. ఆదివారం కౌతాళంలో తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్‌ను దూదేకుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. టిడిపిలో కష్టపడిన కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందనడానికి తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ పదవి నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ కోసం 40 ఏళ్ల నుంచి కష్టపడి పనిచేసిన కుటుంబానికి గౌరవ ప్రదమైన స్థానం లభించిందని తెలిపారు. టిప్పు సుల్తాన్‌పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల రైతులకు సకాలంలో సాగునీరందించి ఆదుకోవాలని కోరారు. ఆంధ్ర రాష్ట్ర వాటా కింద సాగునీరు తీసుకొచ్చి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని తెలిపారు. ఆలూరు, ఆదోని, దేవనకొండ, కోసిగి, మంత్రాలయం, కౌతాళం తదితర మండలాల నుంచి దూదేకుల సంఘం నాయకులు తరలివచ్చారు. మన్సూర్, షేక్షావలీ, శాలి సాహెబ్, మల్కన్న, పేరన్న, మాబు సాబ్, చిన్న ఖాసీం, పీర్ సాబ్, హుస్సేన్ సాబ్ పాల్గొన్నారు.

దగ్గరలోనే మంచి రోజులు...

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు భరోసా ఇచ్చారు. ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో 23వ వార్డు, కల్లుబావిలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నియోజకవర్గంలో మాత్రం రేషన్ షాపు డీలర్ బాధ్యతలను కొన్ని ప్రాంతాల్లో కూటమిలో ఎమ్మెల్యే ఆయన పార్టీ కార్యకర్తలకు కట్టబెడుతున్నారని టిడిపి కార్యకర్తలు నిరుత్సాహంలో ఉన్నారని తెలిపారు. సమస్యను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, టిడిపి నాయకులు, కార్యకర్తలకూ ప్రభుత్వ కార్యకలాపాల్లో భాగస్వామ్యం దక్కేలా అవకాశం వస్తుందని చెప్పారు. పార్టీలో పేదలు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకునేలా స్థానిక నాయకులు శ్రద్ధ చూపాలని కోరారు. నాయకులు రామస్వామి, బాబు నాయుడు, నాగప్ప, మేస్త్రి వీరేష్, వీరేష్, బసవరాజు, జగదీష్, గోవర్ధన్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

ఎస్టీ సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలి

- బోయ/వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ల అంజి వాల్మీకి


ప్రజాశక్తి - తుగ్గలి



ఎస్టీ సాధనకు ప్రతి వాల్మీకీ పోరాటాలకు సిద్ధం కావాలని బోయ/వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు మారెళ్ల అంజి వాల్మీకి కోరారు. ఆదివారం మండలంలోని మారెళ్ల గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉందని, ఎస్టీ సాధన డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు చేపట్టాలని తెలిపారు.

సభ్యత్వంతో ప్రజలకు భరోసా : టిడిపి

ప్రజాశక్తి - నందవరం



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాగరాజ్ గౌడ్

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని టిడిపి సీనియర్ నాయకులు నాగరాజ్ గౌడ్ తెలిపారు. ఆదివారం నందవరం గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు మస్తాన్, ఈషా, వడ్డే గోపాల్, నరసప్ప, రహిమాన్ బాష, జగదీష్, ముత్తు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మహ్మద్ జునైద్

ప్రజాశక్తి - ఆదోని



పార్టీ కండువా కప్పుతున్న మహ్మద్ జునైద్

ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మహ్మద్ జునైదు తెలిపారు. ఆదివారం పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ వాసులు ఎంఐఎంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాముద్దీన్ కాలనీలో సామూహిక మురుగుదొడ్డి కూలిపోయి నెలలు గడిచినా మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. నివాసానికి వ్యక్తిగత మురుగుదొడ్లు లేకపోవడంతో బహిర్భూమికి బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితి కారణంగా మురుగు దొడ్డి నిర్మాణం చేపట్టాలని కోరారు. అంతకముందు కాలనీలో హెల్త్ క్యాంపు నిర్వహించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచి సోమన్న

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందిన పెద్దనేలటూరు గ్రామానికి చెందిన పెయింటర్ గోరంట్ల కుటుంబానికి సర్పంచి సోమన్న ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. పెద్దనేలటూరు గ్రామానికి చెందిన కీల గోరంట్ల (25) వృత్తిరీత్యా పెయింటర్. శనివారం సాయంత్రం గోనెగండ్ల నుంచి స్వగ్రామమైన పెద్దనేలటూరుకు మోటార్ సైకిల్‌పై వెళ్తూ హెచ్.కైరవాడి గ్రామ పొలిమేరలో అదుపుతప్పి రోడ్డుపై కింద పడి మృతి చెందారు. ఆయనకు భార్య శ్రుతి, ఒక కుమారుడు ఉన్నాడు. వారి ఇబ్బందులను గుర్తించిన పెద్దనేలటూరు సర్పంచి సోమన్న తక్షణ ఖర్చుల కింద రూ.10 వేల ఆర్థిక సహాయం మృతుని భార్యకు అందజేశారు.

గణతంత్ర పరేడ్‌కు ఆర్‌యు విద్యార్థి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

దేశ రాజధాని ఢిల్లీలో వచ్చేనెలలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌కు రాయలసీమ వర్సిటీ విద్యార్థి హర్షవర్ధన్ ఎంపికయ్యారు. ఆదివారం వర్సిటీ ఇన్‌ఛార్జీ వైస్ ఛాన్సిలర్ ఎన్‌టికె.నాయక్ విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందించారు. వర్సిటీ తరపున విద్యార్థికి ట్రాక్ సూటును ఆయన అందజేశారు.



దెబ్బతిన్న పంట పొలాలను చూపుతున్న రైతు ఎల్లప్ప

పంటలు దెబ్బతింటున్నాయి

- రైతుల ఆవేదన

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద నుంచి హోన్నూరు కొట్టాలకు నిర్మిస్తున్న నూతన రోడ్డులో 56వ డిపి (డిస్ట్రిబ్యూషన్ పాయింట్) వద్ద పంట పొలాలకు వెళ్లే నీటి పైపులైన్ పగిలిపోవడంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఎల్లప్ప, సిద్ధప్ప, జాంబాపురం బసవ వాపోయారు. ఆదివారం వారు మాట్లాడారు. నిత్యం ఈ రహదారి గుండా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. పైపులైన్ పగిలిపోవడంతో నీటి ప్రవాహానికి రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని, వాహనాల రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆర్.లక్ష్మణ, శరణప్ప, రారావి సిద్ధు, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్పీ ద్వారా రివార్డు, అవార్డు అందుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

స్పెషల్ బ్రాంచి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేణుగోపాల్ రాజు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా రివార్డు, అవార్డు అందుకున్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ వేణు గోపాల్ రాజ్‌కు క్యాష్ రివార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఎస్ఐ

పాఠశాలల విలీన జిఒను రద్దు చేయాలి

- ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ జారీ చేసిన జిఒ 117 ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ముత్తన్న కోరారు. ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు రఘురామయ్య, జిల్లా అధ్యక్షులు బి.నాగరాజు హాజరయి మాట్లాడారు. విలీనం వల్ల విద్యా ప్రమాణాలు పెరుగుతాయని ప్రభుత్వం చెప్పిందని, 4,600 ప్రాథమిక పాఠశాలు ఈ విధంగా విలీనం చేయడం వల్ల ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని తెలిపారు. అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అదనపు పీరియడ్లను కేటాయించడం వల్ల వారిపై ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. దీనిపై సమీక్ష చేసి సంబంధిత ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంగమేశ్వర్, భీమారెడ్డి, సిద్ధలింగ, అశ్వద్ధప్ప, తిక్కస్వామి, పార్థసారథి, రామాంజనేయులు, రాఘవేంద్ర, బీరప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆనందోత్సావాల మధ్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఆనందోత్సావాల మధ్య సంబరాలు చేసుకున్నారు. ముందుగా తమకు విద్య నేర్పిన గురువులు శంకరయ్య, శేష ఫణి శర్మ, ఎం.నారాయణరెడ్డి, హైమావతమ్మకు ఘనంగా బాణసంచాతో స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సన్మానించారు. తర్వాత ఒకరినొకరు పరిచయం చేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన వారు, వివిధ ఊళ్లలో స్థిరపడిన వారు, తమ పదో తరగతి నాటి అనుభూతులను పంచుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు రూ.25 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను బహుమతిగా అందజేశారు. ప్రముఖ గాయకుడు సురేష్ దంపతులు ఆర్కేస్ట్రా పాటలతో అలరించారు. వైసిపి మండల నాయకులు రవి రెడ్డి, సత్య సాయి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు గఫూర్, రఘురామి రెడ్డి, మల్లెపల్లె మురళీ మోహన్ రెడ్డి, వడ్ల మహేష్, శ్రీధర్ శర్మ, వెంకటేశ్వర రెడ్డి, దేవరాజ్, పీతాంబరం పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బెస్ట్ ఇంపాక్ట్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందజేత

ప్రజాశక్తి - కర్నూలు

నగరంలోని ఆంధ్రప్రదేశ్ టూరిజం హరిత హోటల్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంపా నాగేశ్వర్ రావు ఆశీస్సులతో ట్రెయిన్ ది ట్రైనర్ వర్క్ షాపు నిర్వహించారు. 35 మంది ట్రెయినర్స్‌కు రెండు రోజుల పాటు శిక్షణ, నెల రోజుల పాటు జూమ్‌లో ట్రెనింగ్ ఇచ్చారు. ఈ వర్క్ షాప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పి.మాసుంబీకి ఐసిఐ సర్టిఫికెట్‌ను వినియోగ దారుల ఫోరం కమిషన్ ఛైర్మన్, జిల్లా జడ్జి కరణం కిషోర్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం ప్రదానం చేశారు. రీజినల్ ప్రెసిడెంట్ కె.రవీంద్ర ధీర, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నేషనల్ సెక్రటరీ రామచంద్రుడు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాధవి, రీజినల్ సెక్రటరీ మహేంద్ర కోటకొండ, ఆఫ్ లైన్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ టప్పా గోపీనాథ్, ఆన్‌లైన్ ఇన్‌ఛార్జీ షేక్ పర్వీన్, మెంటర్ దామోదర్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న మాసుంబీ